# తండ్రి గారి సందేశం....



## క్రిస్మస్ - దేవుడు మన మధ్యలో ఉన్నాడని గుర్తు చేసే పండుగ

**క్రీస్తు నాథుని యందు ప్రియ సహోదరీ సహోదరులారా!**

అత్యంత ఉత్సాహంతో, అపరిమిత ఆనందముతో చిన్నారి బాలయేసుని రాకడ కోసం మనం ఎదురుచూసే రోజులు ఇవి. "ఇదిగో! కన్య గర్భము ధరించి ఒక కుమారుని కనును. ఆయనను 'ఇమ్మానుయేలు' అని పలిచెదరు" అని ప్రవక్తతో ప్రభువు పలికినది నెరవేరునట్లు ఇదంతయు సంభవించెను. "ఇమ్మానుయేలు" అనగా "దేవుడు మనతో ఉన్నాడు" అని అర్థము (మత్తయి 1,22-23). దేవుడు నివసించేది పైనున్న ఆకాశములో కాదు కాని, మన మధ్యలలోనే అనేది క్రిస్మస్ పండుగ యొక్క అతి ముఖ్యమైన సందేశం. ఏదేను తోటలో ఆదిమ తల్లిదండ్రులతో పాటు తిరుగుతున్న దేవుని మనం చూస్తున్నాము (ఆది 3,8). పగలు దారి చూపు మేఘ స్థంభముగాను, రాత్రి వెలుగు నిచ్చు అగ్ని స్థంభముగాను ప్రభువు ఇశ్రాయేలీయుల ముందు నడిచినట్టు నిర్గమ కాండములో మనం చదువుతున్నాము. తాను ఎన్నుకొన్న ఇశ్రాయేలు ప్రజలను ముందు నుండి నడిపించి, వారి మధ్యలోనే గుడారములో నివసిస్తున్న దేవుని మనం చూస్తున్నాము. ఇలా ఆదికాండము మొదలుకొని దర్శనగ్రంథం వరకు మనం చదివితే, మానవుల మధ్యలో నివసించడానికి ఇష్టపడే దేవుని మనం కనుగొనవచ్చు. పవిత్ర గ్రంథములో మనం కనుగొనిన ఈ దేవుని స్వభావానికి అతి పెద్ద రుజువు క్రిస్మస్ పండుగ.

దేవుడు లోకమును ఎంతో ప్రేమించి తన ఏకైక కుమారుని ప్రసాదించిన రోజు ఇది (యోహాను 3,16). రెండువేల సంవత్సరాల క్రితం యేసు ప్రభువు ఈ లోకములో మానవునిగా అవతరించి అన్ని విధాలుగా మానవునిగా జీవించి, అన్ని విధాలుగా శోధింపబడి, మరణించి, పునరుత్థానుడై ఈ రోజు కూడా మనతో పాటు నివసిస్తున్నాడు అనేది గొప్ప సత్యం. "ఇదిగో లోకాంతము వరకు నేను మీతో నుందును" (మత్తయి 28,20) అని ప్రభువే మనకు సెలవిస్తున్నాడు.

దేవుడు మనతో జీవించడం అనేది కాదనలేని సత్యం అని పవిత్ర గ్రంథం మనకు సాక్ష్యం ఇస్తుంది. ఈ రోజులలో కూడా దేవుని శక్తివంతమైన హస్తాన్ని, ఆయన సాన్నిధ్యాన్ని ఎన్నో విధాలుగా మనం దర్శిస్తున్నాము. ఈ క్రిస్మస్ పండుగను అర్థవంతమైన విధములో మనం కొనియాడలంటే, దేవుడు మనతో పాటు నివసించే సత్యాన్ని తెలుసుకుంటూ, మనతో పాటు నివసించే దేవుని మనం మన హృదయ కోవెలలోకి ఆహ్వానించాలి. నా కుడిచేతిని పట్టుకొని దేవుడు నన్ను నడిపిస్తున్నాడని మనం విశ్వసించాలి (యెషయా 41,13). ఆ విశ్వాసం మనకు ధైర్యాన్ని ఇస్తుంది. తమలో దేవుని సాన్నిధ్యం అనుభవించేవారు గొప్ప కార్యములు చేయగలుగుతారు.

మానవ దృష్టిలో అత్యల్పుగా ఉన్నవారు, తమలో దేవుని సాన్నిధ్యం తెలుసుకొన్న తరువాత ఆ విశ్వాసముతో చేసిన గొప్ప కార్యముల చరిత్రే పరిశుద్ధ గ్రంథం.

ఒక గొప్ప జనసమూహమును ఎడారిలో 40 సంవత్సరాలు నడిపించడానికి బండనాలుక వలన తడవుకొనుచు మాట్లడుతున్న మోషేకు సాధ్యమైదంటే తప్పకుండా ఆయన దేవుని సాన్నిధ్యం తెలుసుకొని ఉండవచ్చు. సమూవేలు మొదటి గ్రంథములో 17వ అధ్యాయంలో మహా శూరుడైన గొలియాతును ఎదురుకోవడానికి ధైర్యముతో వెళ్తున్న దావీదును మనం చూడవచ్చు "నీవు కత్తి, యీటె, బాకు గైకొని నా మీదికి వచ్చితివి. కాని నేను సైన్యములకు అధిపతియైన యావే దేవుని పేర, నీ మీదికి వచ్చితిని" (1 సమూవేలు 17,45) అని పలికిన దావీదు రాజు విశ్వాసం మనం సొంతం చేసుకోవాలి. "గాఢాంధకారపు లోయలలో పయనించినప్పుడును నేనెట్టి అపాయమునకును భయపడను" (కీర్తన 23,4). అని దావీదు పాడినట్లు మనం చదువుతున్నాము. "శత్రువులు వారి ఆయుధముల మీదను, సాహసము మీదను ఆదారపడవచ్చునేమోకాని, మనము మాత్రము సర్వోన్నతుడైన దేవుని మీద ఆధారపడవలసిన వారము" (2 మక్కాబీయులు 8,18) అని దృఢంగా చాటి చెప్పి గొప్ప సైన్యములతో దండెత్తి వస్తున్న నికానోరు రాజును ఎదురుకొన యూదా మక్కబీయునుకు సైతం దేవుని సాన్నిధ్యము ధైర్యముగా మారింది.

యేసు ప్రభుని సాన్నిధ్యము ఇచ్చే ధైర్యముతో లోకపు నలుమూలలో సువార్త వ్యాప్తి చేసిన అపోస్తులులు, యేసయ్య కోసం ప్రాణాన్నే త్యాగం చేసిన హతసాక్షులు, లోకసుఖాలను విడిచిపెట్టి యేసయ్య సాన్నిధ్యమే చాలని నమ్మి ఒంటరిగా జీవించిన పుణ్యపురుషులు. ఇలా అనేక మంది ప్రభుని కోసం తమ స్వంత జీవితాలనే బలిగా అర్పించిన వారు మన మధ్యలోనే జీవించి ఉన్నారు. వీరందరు మన జీవితములో యేసయ్య సాన్నిధ్యం ధైర్యముగా మారుతుందని నేర్పిస్తున్నారు. ఈ క్రిస్మస్ పండుగ ద్వారా దేవుని సాన్నిధ్యాన్ని గ్రహించి, ఆయనను మన అనుదిన జీవితములో అనుభవించి మన జీవితాలను దేవుని కార్యాలకు ఒక వేదికగా మార్చుకోవడానికి సిద్ధపడుదాం.

**మీకందరికి క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు.**

**జీవము గలిగిన సజీవ దేవుని జీవస్వరం**
**మనలనందరిని జీవింపజేయును గాక. ఆమెన్.**

క్రీస్తు నందు మీ తండ్రి
**బిషప్ ప్రిన్స్ అంతోని**
ఆదిలాబాద్ గురుపీఠ మేత్రాణులు

